క్లుప్తంగా

ఎస్సై ప్రకాష్‌రావుకు వీడ్కోలు



ఎస్సై ప్రకాష్‌రావును సత్కరించిన ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్ : పోలీస్ శాఖలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించి, అభినందనలు అందుకోవటం స్ఫూర్తిదాయకమని, పదవీ విరమణ అనంతరం ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు సీసీఎస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన ఎస్సై బి.ప్రకాషరావుకు ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి, అనేక సమస్యలు, ఒత్తిడులను ఎదుర్కొంటూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని ప్రకాష్‌రావును కొనియడారు. ఈ సందర్భంగా ఈయన్ని ఎస్పీ మేరీప్రశాంతి, అదనపు ఎస్పీ స్వరూపరాణి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోలీస్ వెల్ఫేర్ ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు, ఎస్సై ప్రకాష్‌రావు కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు హనుమద్ జయంతి పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి దేవస్థానంలో 24వ వార్షిక హనుమద్ జయంతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు స్వామి వారికి ఏకాదశ వార మన్యుసూక్త సంపుటిత రుద్రాభిషేకం, 9 గంటలకు భక్తులచే ఉత్సవ మూర్తులకు అభిషేకం, విశేష అలంకరణ, అనంతరం కదళీఫల అర్చన, 108 వడమాలల సమర్పణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు లక్ష్మీ గణపతి, నవగ్రహ, మృత్యుంజయ సహిత మన్యుపాశుపత హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారని తెలిపారు. రాత్రి స్వామి వారికి విశేష పల్లకి సేవ, మల్లెపూలతో పుష్పార్చన, హారతులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంల వరకూ భక్తులచే హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహిస్తారన్నారు. నగరంలోని పత్తేబాద, నరసింహరావు పేట, ఒన్‌టౌన్ తదితర ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విజయంపై ఎవరి ధీమా వారిదే !

- త్రిముఖ పోరులో ఆళ్ల నానికి రెండు సార్లు విజయం
- ఏలూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు అత్యధిక మెజార్టీ 47,515
- అత్యల్ప మెజార్టీ 990

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఈ నెల నాలుగో తేదీన నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో గెలుపెవరిదో అనే ఉత్కంఠ నెలకొంది. గెలుపుపై అటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆళ్ల నాని వర్గంలో, ఇటు కూటమి అభ్యర్థి బడేటి చంటి వర్గంలో ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలను విశేషంగా ఆకర్షించారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన నేతగా జగన్ ప్రజల్లో విశ్వాసాన్ని కూడగట్టుకున్నారు. అదే తమ గెలుపుమంత్రంగా పని చేస్తుందని ఆళ్ల నాని వర్గం ఘంటాపథంగా చెబుతోంది. అయితే తమ కూటమి అధికారంలోకి వస్తే ఉచిత గ్యాస్, ఉచిత బస్ ప్రయాణం, బీజేపీ, జనసేన పార్టీల మద్దతు తమ గెలుపుకు ఉపయోగపడతాయనే ఆశాభావం బడేటి చంటి వర్గంలో కనిపిస్తోంది.

అత్యధిక మెజార్టీ 47,515

1952వ సంవత్సరం నుంచి ఇప్పటికి ఏలూరు నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు నిర్వహించారు. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా 1983వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ చెన్న కేశవుల రంగారావు 47,515 ఓట్ల మెజార్టీ సాధించారు. రూపాయి డాక్టర్‌గా నియోజకవర్గ ప్రజల్లో గుర్తింపు కలిగిన రంగారావుకు ఆ ఎన్నికల్లో 62,657 ఓట్లు పోలయ్యాయి. ఆయన ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి పులి వెంకట సత్యనారాయణకు 15,142 ట్లు మాత్రమే లభించాయి. 1962లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నుంచి ఎ.సర్వేశ్వరరావు 990 ఓట్ల మెజార్టీతో గట్టెక్కారు. ఇదే ఈ నియోజకవర్గంలో నమోదైన అత్యల్ప మెజార్టీ. ఆ ఎన్నికల్లో సర్వేశ్వరరావుకు 26,235 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శీర్ల బ్రహ్మయ్యకు 25,245 ఓట్లు పోలయ్యాయి. కాగా 2009వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పాటు టీడీపీ, ప్రజారాజ్యం పార్టీలు పోటీ చేశాయి. కాంగ్రెస్ నుంచి అప్పటికే ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్ల నాని బరిలో నిలవగా టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అంబికా



కృష్ణ, ప్రజారాజ్యం నుంచి బడేటి బుజ్జి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఆళ్ల నాని విజయం సాధించగా బడేటి బుజ్జి ద్వితీయ, అంబికా కృష్ణ తృతీయ స్థానాలకు పరిమితమయ్యారు. 2019వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కూడా త్రిముఖ పోటీ నెలకొంది. వైఎస్సార్ సీపీ నుంచి ఆళ్ల నాని పోటీ చేయగా టీడీపీ నుంచి బడేటి బుజ్జి, జనసేన నుంచి రెడ్డి అప్పలనాయుడు పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లోనూ ఆళ్ల నాని విజయం సాధించారు. త్రిముఖ పోటీ జరిగిన రెండు సందర్భాల్లోనూ నియోజకవర్గ ప్రజలు ఆళ్ల నానికే పట్టం కట్టడం విశేషం.

ఏలూరు నియోజకవర్గంలో ఆయా ఎన్నికల్లో అభ్యర్థులు, పార్టీలు, మెజార్టీలు ఇలా ఉన్నాయి..

సంవత్సరం	అభ్యర్థి పేరు	పార్టీ	పోలైన ఓట్లు	ప్రత్యర్థి	పార్టీ	పోలైన ఓట్లు	మెజార్టీ
1952	గారపాటి సత్యనారాయణ	సీపీఐ	--	ముల్పూరి రంగయ్య	కాంగ్రెస్	--	7638
1955	శీర్ల బ్రహ్మయ్య	కాంగ్రెస్	22,322	ఎ.సర్వేశ్వరరావు	సీపీఐ	17,010	5,312
1962	ఎ.సర్వేశ్వరరావు	సీపీఐ	26,235	శీర్ల బ్రహ్మయ్య	కాంగ్రెస్	25,245	990
1967	ఎం.వెంకటనారాయణ	కాంగ్రెస్	18,003	ఎ.సర్వేశ్వరరావు	సీపీఐ	13,163	4840
1972	అమ్మనగంటి శ్రీరాములు	స్వతంత్ర	20,685	ఎం. వెంకటనారాయణ	కాంగ్రెస్	18,880	1805
1978	నంబూరి సూర్యప్రకాశరావు	కాంగ్రెస్	34,825	అమ్మనగంటి శ్రీరాములు	జనత పార్టీ	24,113	10,712
1983	చెన్నకేశవ రంగారావు	స్వతంత్ర	62,657	పులి వెంకటసత్యనారాయణ	కాంగ్రెస్	15,142	47,515
1985	మరడాని రంగారావు	టీడీపీ	52,078	నంది బాల సత్యనారాయణ	కాంగ్రెస్	32,038	20,040
1989	నేరేళ్ల రాజా	కాంగ్రెస్	54,414	మరడాని రంగారావు	టీడీపీ	50,075	4339
1994	మరడాని రంగారావు	టీడీపీ	57,808	మాగంటి వరలక్ష్మిదేవి	కాంగ్రెస్	48,561	9247
1999	అంబికా కృష్ణ	టీడీపీ	59,678	ఆళ్ల నాని	కాంగ్రెస్	52,363	7315
2004	ఆళ్ల నాని	కాంగ్రెస్	72,490	మరడాని రంగారావు	టీడీపీ	39,437	33,053
2009	ఆళ్ల నాని	కాంగ్రెస్	49,962	బడేటి బుజ్జి	పీఆర్‌పీ	36,280	13,682
2014	బడేటి బుజ్జి	టీడీపీ	82,483	ఆళ్ల నాని	వైఎస్సార్ సీపీ	57,880	24,603
2019	ఆళ్ల నాని	వైఎస్సార్ సీపీ	72,247	బడేటి బుజ్జి	టీడీపీ	68,175	4072

ఉద్యోగుల ప్రజాసేవ అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ ఉద్యోగులు తమ సంఘాల ద్వారా సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించడం అభినందనీయమని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు అన్నారు. విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం సౌజన్యంతో ఈపీడీసీఎల్ డిస్కం ప్రధాన కార్యదర్శి తురగా రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్ పేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేబీబీ నటరాజన్ ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా ఎస్ఈ సాల్మన్‌రాజు పాల్గొని మాట్లాడారు. ఇక్కడ గత 30 రోజుల నుంచి మజ్జిగ చలివేంద్రం కొనసాగుతోందన్నారు. తురగా రామకృష్ణ మాట్లాడుతూ నిత్యం 150 లీటర్ల చల్లటి మజ్జిగతో పాటు మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వేసవిలో ప్రతి ఏడాది మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ ఓసి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం నిరంజన్, డివిజన్ కార్యదర్శులు సీహెచ్‌పీసీ శ్రీనివాస్, నరసింహారావు, టౌను ఏడీఈ కృష్ణరాజా తదితరులు పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా అభివృద్ధి చెందాలి

ఏలూరు (టూటౌన్): యాదవులు అంతా ఐకమత్యంతో రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. యాదవులు అన్ని రంగాల్లో ముందుకు దూసుకు పోవాలన్నారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో యాదవులు రాణించాలని కోరారు. ప్రతి ఒక్కరూ యాదవ జాతి అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు శ్రీనివాసరావు (బుజ్జి), ప్రధాన కార్యదర్శి గొర్ల రామారావు, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల గంగాధరరావు, కైకలూరు అధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు దిమ్మిటి రమేష్, రాష్ట్ర యాదవ సంఘం నాయకుడు భాస్కర్ యాదవ్, నూజివీడు అధ్యక్షుడు తెలుసు రవి, చింతలపూడి అధ్యక్షుడు చిన్ని, ఉంగుటూరు అధ్యక్షుడు ఆకుల నరేష్, సాయల స్వాతి, కంపపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు





ఏలూరు వడ్డెరగూడెంలో అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ , వెన్నవల్లివారిపేటలో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

వన్‌టౌన్ సీఐ రాజశేఖర్

ఏలూరు టౌన్ : జూన్ నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్ హెచ్చరించారు. ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ రాజశేఖర్ ఏలూరు నగరంలోని వడ్డెరగూడెం, వెన్నవల్లివారి పేటలో శుక్రవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిందని, జూన్ నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సజావుగా సాగేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని చెప్పారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. దీంతో ప్రజలు గుంపులుగా ఉండకూడదని, ఏదైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలకు భయ భ్రాంతులకు గురిచేసినా, ఇష్టారాజ్యంగా రాజకీయ పార్టీల పేరుతో కుల, మత వైషమ్యాలను రేకెత్తించినా చర్యలు తప్పవని సీఐ రాజశేఖర్ అన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి అన్నారు. శుక్రవారం ఆయన ఏలూరు రూరల్ మండలంలో మాదేపల్లి, జాలిపూడి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం నిర్వహణకు రూ.2.50 లక్షల కోట్లు విడుదల చేయాల్సుండగా, కేంద్ర ప్రభుత్వం రూ.63 వేల కోట్లు మాత్రమే విడుదల చేస్తోందని చెప్పారు. నిధుల మంజూరులో జాప్యం చేస్తూ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. వామపక్షాల పోరాటంతో 2005లో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పని దినాలు 200 రోజులకు పెంచి, కూలీలు పని చేసే ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రయాణ ఖర్చులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు గ్రామాల కూలీలకు సైతం పని కల్పించాలని అధికారులను కోరారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు కూలీలు సంఘటితమై ఆందోళన చేపడతామన్నారు. సీఐటీయూ నాయకుడు జె.గోపి పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యావిధానంలో నిర్వహించిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సబంధించిన శనివారం నుంచి ప్రారంభించే సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పీడీఎస్‌యూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహంను కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ ఇంటర్ పేరుతో జిల్లాలో ఉన్న కొన్ని ప్రత్యేక సెంటర్ల (స్కూల్, కాలేజీ) యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేశాయని పేర్కొన్నారు. అయితే విద్యార్థులు కూడా పాస్ గ్యారెంటీ అని ఆశపడి యాజమాన్యాలు ఎంత అడిగితే అంత రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకు చెల్లించారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం రూ.3000 లోపు మాత్రమే ఖర్చయ్యే ఈ డిస్టెన్స్ ఇంటర్మీడియట్ విద్యకి యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ పేరుతో కనీసం రసీదు కూడా ఇవ్వకుండా విద్యార్థుల నుంచి ఫోన్ పే రూపంలో, నగదు రూపంలో వేలాది రూపాయలు వసూలు చేసి మోసం చేశారని వివరించారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఇప్పుడు విద్యార్థులు వెళ్లి యాజమాన్యాలను ప్రశ్నిస్తే తమకు ఎటువంటి సంబంధం లేదని, సప్లమెంటరీలో మళ్లీ డబ్బులు కట్టుకుని రాసుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని విద్యార్థులు పీడీఎస్‌యూ దృష్టికి తీసుకొచ్చినట్టు వివరించారు. సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గత 15 రోజుల నుంచి యాజమాన్యాలు మిగిలిపోయిన సబ్జెక్టులు పాస్ అవ్వాలంటే తాము అడిగిన డబ్బులు ఇవ్వాలని విద్యార్థులను బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రైవేట్ యాజమాన్యాల చేతిలో విద్యార్థులు మోసపోకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, నగర కమిటీ సభ్యుడు ఎం రేవంత్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సినీ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కృష్ణ



కేక్ కట్ చేస్తున్న అభిమాన సంఘం నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు సినీ పరిశ్రమలో దివంగత సూపర్ స్టార్ కృష్ణ విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారని కృష్ణ అభిమాని, ఏపీ మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ దిరిశాల వరప్రసాద్ అన్నారు. పద్మభూషణ్, సూపర్ స్టార్ కృష్ణ 81వ జయంతి కార్యక్రమాన్ని కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరులో ఘనంగా నిర్వహించారు. వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగులో మొదటి కలర్ సినిమా, సినిమా స్కోప్, 70 ఎంఎం, అధిక సాంకేతి పరిజ్ఞానాన్ని తెలుగు చిత్ర సీమలో కృష్ణ ప్రవేశపెట్టారన్నారు. నటునిగా, నిర్మాతగా, దర్శకునిగా, రచయితగా రాణించిన కృష్ణ సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా నిర్వహించే వారని గుర్తుచేశారు. కృష్ణ అభిమాని, రంగస్థల నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజా వలి మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ సాహసానికి మరో పేరుగా నిలిచారని కొనియాడారు. తొలుత కేకును అభిమానులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచారు. కృష్ణ, మహేష్ బాబు అభిమానుల సంఘం సిటీ వైడ్ ప్రెసిడెంట్ కొవ్వులూరి నాగేంద్ర నాని, అభిమానులు ఎండీ సిరాజ్, మాఊరి రాహుల్, జీహెచ్‌డీ ప్రసాద్, కె.వీరి నాయుడు, ఎ.రమణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : వడ్డీ వ్యాపారస్తుల వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న పాకుర్ల వెంకన్నబాబు కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి కోరారు. స్థానిక ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మాదేపల్లి పంచాయతీ పరిధిలోని లింగారావుగూడెం గ్రామానికి చెందిన పాకుర్ల వెంకన్నబాబు (33) దళిత సామాజిక వర్గానికి చెందిన వాడు కావడంతో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులకు బలైపోయాడని వాపోయారు. వెంకన్నబాబుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, బాధిత కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వం కోరారు. వడ్డీ వ్యాపారస్తులు అప్పు సొమ్మును రాబట్టుకునేందుకు ఇంటి వద్ద ఉన్న ఆటోను బలవంతంగా స్వాధీనం చేసుకొని తీసుకెళ్లడంతో మనస్థాపానికి గురైన వెంకన్నబాబు మే 30వ తేదీ గురువారం సాయంత్రం నిద్ర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. వెంకన్నబాబు మరణానికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సీహెచ్ అమర్ కుమార్, బలరాం తదితరులు పాల్గొన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు వెంకన్నబాబు కుటుంబాన్ని పరామర్శించి తమ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సమీపంలో రైల్వే బ్రిడ్జి జాతీయ రహదారిపై యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులిచ్చిన సమాచారంతో ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. సుమారు 35 సంవత్సరాలు వయస్సు ఉన్న వ్యక్తి మెడలో రుద్రాక్ష మాల ఉందని, ప్యాంట్ షర్ట్ ధరించి ఉన్నాడని, చెవిపోగులు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రూరల్ ఎస్సై సెల్ నెంబర్ 94407 96636కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రత్నగ్రేస్ హత్య దారుణం

ఏలూరు (టూటౌన్): మహిళలపై జరిగే హత్యలు, అత్యాచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఏలూరు సత్రంపాడులో రత్నగ్రేస్ అనే యువతి గొంతు కోసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లాల్సిన రత్నగ్రేస్ మృత్యుఒడిలోకి చేరుకోవడం బాధాకరమని, ఆమె మృతికి ప్రగాఢ సానుభూతిని, ఆమె కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. రత్నగ్రేస్ కుటుంబాన్ని ఆదుకోవాలని రవి ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	12

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	27

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	88
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	04, 06
బెండకాయలు	36	కంద	72
పచ్చిమిర్చి	80	బీట్‌రూట్	36
కాకర కాయలు	44-60	కీరా దోస	50
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	60	అల్లం	168
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	36-52	పాలకూర	15
దొండకాయలు	20	చుక్కకూర	15
బంగాళదుంపలు	34	తోటకూర	12
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	58	పుదీనా	05
దోసకాయలు	34	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

